క్లుప్తంగా

సాయం చేస్తామని నమ్మించి మోసం చేశారు



ఆదుకోవాలని కోరుతున్న జ్యోతి సాయి శ్రీ, అత్త కాంతం

కాకినాడ రూరల్: తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే తన భర్త గుబ్బల శ్రీను సంక్రాంతి పండగలో వలసపాకలలో జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడి నాలుగు రోజుల పాటు చికిత్స పొంది మృతి చెందారని, అప్పట్లో ఆదుకుంటామని నమ్మించిన గ్రామ కూటమి నేతలు మోసం చేశారని శ్రీను భార్య జ్యోతి సాయి శ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తన అత్తయ్య కాంతంతో వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, అత్తయ్య, తాను ఉంటున్నామని, భర్త చనిపోయినప్పుడు రూ.2 లక్షలు ఇస్తామని గ్రామంలోని కూటమి నేతలు హామీ ఇచ్చారని, చనిపోయిన తరువాత దహన ఖర్చులుగా రూ.50 వేలు అందించారని మిగిలిన సొమ్ములు ఇవ్వలేదని దీనిపై గ్రామ కూటమి నాయకుడిని అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. పైగా తమపైనే వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తన భర్త ఎన్నికల్లో కూటమి తరఫున పనిచేశారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే పంతం నానాజీ తమకు న్యాయం చేయాలని, బీమా సొమ్ములు ఇప్పించాలని ఆమె కోరారు.

బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం



బాటసారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న జాతీయ జలవిజ్ఞాన సంస్థ సీనియర్ సైంటిస్ట్ విజయ్‌కుమార్

బోట్‌క్లబ్: బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని జాతీయ జలవిజ్ఞాన సంస్థ సీనియర్ సైంటిస్ట్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్టీవో కార్యాలయం సెంటర్‌లో జాతీయ జలవిజ్ఞాన సంస్థ ఉన్నతాధికారి కవికొండల వెంకట రత్న వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రం నిర్వాహకులు వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌ఆర్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో మూడు నెలలు పాటు చలివేంద్రాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజు వెయ్యి లీటర్ల మజ్జిగ, 5వేల లీటర్ల మంచినీరు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. దీని కోసం ప్రత్యేక సిబ్బందిని కూడా ఏర్పాటు చేశామన్నారు.

పేదలకు కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు అందజేస్తున్న వ్యాపారవేత్త కుమార్

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ కాకినాడ హాల్లో గురువారం బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐగ్లాస్ ప్రాజెక్టు ద్వారా 40 మంది పేదలకు కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త కొమ్మిశెట్టి కుమార్ వీటిని అందజేసి మాట్లాడుతూ 12 ఏళ్లుగా ప్రాజెక్టు ద్వారా కొన్ని వేల మందికి సేవలు అందచేయడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ, జీఎల్ జగన్నాధరావు, డి.రామసుబ్రమ్మణ్యం, శ్రీనివాస్, జరీనా పాల్గొన్నారు.

హాకీ క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడాకారులకు హాకీ కిట్లు పంపిణీ చేస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, హరీష్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ హాకీలో రాణిస్తున్న క్రీడాకారులకు జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో గురువారం క్రీడా సామగ్రి, క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.

జిల్లా క్రీడామైదానంలో హాకీ కోర్టులో జరిగిన కార్యక్రమానికి డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, సానా సతీష్ బాబు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరిష్, హాకీ సంఘ ప్రతినిధి వి.రవిరాజు ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరై క్రీడాకారులకు హాకీ స్టిక్స్, బాల్స్, షూస్, స్టాకిన్స్ పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి జార్జి, పీడీలు సూరిబాబు, పరశురాం సురేష్‌రాజు, సునీల్ పాల్గొన్నారు.

కుక్కలతో బైట్‌కి రాలేకున్నాం!

- రాత్రులు ఈట్ స్ట్రీట్‌లో..
- పగలు పీఆర్ కళాశాలలో తిష్ట
- సుమారు 20 మంది వాకర్లపై దాడి
- అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



ఈట్ స్ట్రీట్‌లో సంచరిస్తున్న కుక్కలు



పీఆర్ కళాశాలలో కుక్క పిల్లలు

కాకినాడ లీగల్: రోజురోజుకు పెరిగిపోతున్న కుక్కల బెడదతో జనం హడలిపోతున్నారు. బాబోయ్.. కుక్కలంటూ అటు వైపు వెళ్లాలంటే వాహనచోదకులు, పాదచారులు, వాకర్లు భయపడిపోతున్నారు. కాకినాడ సిటీలో ఏ వీధి చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా కాకినాడ నగరంలో ఇటీవల పీఆర్ కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్‌కు ప్రజల సంచారం బాగా పెరిగింది. పీఆర్ కళాశాల గోడకు అనుకుని ఉన్న ఈట్ స్ట్రీట్‌లోను, జెడ్పీ సెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ఉన్న వీధుల్లో ప్రధాన రహదారులు, వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు, వాకర్లపై దాడి చేసి కరుస్తున్నాయి. అలాగే పీఆర్ కళాశాలలో ఉదయం, సాయంత్రం వాకర్లు నడుస్తుంటారు. అయితే కళాశాల ఆవరణలో కుక్కలు పిల్లలు పెట్టి ఉండడం, ఎక్కువగా ఆ ఆవరణలో కుక్కలు సంచరిస్తుండడంతో ప్రతీ రోజు ఇద్దరు ముగ్గురు వాకర్లు కుక్కకాట్లకు గురి అవుతున్నారు. అలాగే విద్యార్థులు వాటిని చూసి భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో ఈట్ స్ట్రీట్ వద్ద దొరికే ఆహార పదార్థాలను తింటూ పగలు పీఆర్ కళాశాలలో విద్యార్థులపై, వాకర్లపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. కుక్కలను ఇక్కడి నుంచి తరలించే ఏర్పాట్లు చేయాలని వాకర్లు, విద్యార్థులు కోరుతున్నారు. అలాగే నగరంలో ఇళ్ల ముందు ఆడుకుంటున్న పిల్లలపై కూడా కుక్కలు దాడి చేసి కరుస్తున్నాయి. అలాగే ద్విచక్ర వాహనచోదకులను వెంబడిస్తున్నాయి. ఏడాది కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 310 వరకు కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. కుక్కల బారిన పడుతున్న వారిలో చిన్నపిల్లలు కూడా ఎక్కువగా ఉంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కలను నివారించాలి



కుక్కలను చంపడం నేరమంటూ జంతు హింసా సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. అయితే వీధుల్లో గుంపులుగా పెరిగిపోతున్న కుక్కలతో జనం హడలిపోతున్నారు. ఏ సమయంలో ఏ కుక్కకాటుకు గురికావలసి వస్తుందోనని భయపడుతున్నాం. ఇటీవల చిన్నారులు, పాదచారులు కుక్కల బారిన పడి గాయాలపాలవుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

జీఎస్ఆర్ కృష్ణారావు, కాకినాడ

భయపడుతూ వాకింగ్ చేస్తున్నాం



ఇంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకల్లా పీఆర్ కళాశాలకు వచ్చి వాకింగ్ చేసుకుని వెళ్లే వాళ్లం. కుక్కలు వాకర్స్‌పై దాడి చేసి కరుస్తుండడంతో వాకింగ్ చేయాలంటే భయమేస్తుంది. ఏ పక్క నుంచి ఏ కుక్క వచ్చి కరుస్తుందోనని ఆందోళన చెందుతున్నాం. ఇప్పటికే పీఆర్ కళాశాలలో 200 మంది విద్యార్థులపైనా, వాకర్స్‌పైనా దాడి చేసి గాయపరిచాయి. దీనితో విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి శునకాల నిర్మూలనకు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

ఆర్.వెంకటేశ్వరరావు, వాకర్, కాకినాడ

నేహాంజనికి సత్కారం



నేహాంజనికి జ్ఞాపిక అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన యాళ్ల నేహాంజని ఉన్నత చదువులకు తమ ఫౌండేషన్ అండగా నిలుస్తుందని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులు సాధించిన నేహాంజలిని గురువారం ఆమె నివాసంలో సత్కరించి, జ్ఞాపిక అందించారు. రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ఫోన్‌లో నేహాంజనిని అభినందించారు. కార్యక్రమంలో జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులు మేకా లక్ష్మణ మూర్తి పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాల్లో సామా స్కూల్ ప్రతిభ

బాలాజీచెరువు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించారని సామా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సామా ఈశ్వర రావు గురువారం తెలిపారు. పి.రమ్యశ్రీ, కె.అభిషేక్ సిరివన్ 594, పి.బ్రహ్మయ్య 593, సీహెచ్ సౌజన్య 590, జి.బంగారు హర్ష 578, జి.భువన యశ్వంత్ 585, ఎం.అక్షయజ్యోతి 584, డి.లక్ష్మీనారాయణ 582, సీహెచ్ దుర్గామహేష్ 581, సయ్యద్ సాజిదా 580 సాధించరన్నారు. తమ పాఠశాల నుంచి 151 మంది హాజరుకాగా 150 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ రాజేశ్వరి, రత్నమాల, సూర్యశ్రీ, ప్రిన్సిపాల్ హనుమంతరావు అభినందించారు.

చిన్నారులకు స్వీట్ల పంపిణీ

బాలాజీచెరువు: అలయన్స్ క్లబ్ శరవణ్ క్లబ్ సభ్యులు ప్రేక్షా సదానాని పుట్టినరోజు సందర్భంగా గురువారం మహర్షి సాంబమూర్తి దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యాళ్ల రత్నారావు, దిలీప్‌కుమార్ సదానాని పాల్గొన్నారు.

మండు వేసవిలో మూగజీవాలను ఆదరిద్దాం

- సద్గురువు డాక్టర్ ఉమర్ ఆలీషా
- బోట్‌క్లబ్ వద్ద చలివేంద్రం ప్రారంభం



సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ వద్ద చలివేంద్రాలు ప్రారంభిస్తున్న సద్గురువు ఉమర్ ఆలీషా

కాకినాడ రూరల్: మండు వేసవిలో మూగ జీవాలకు ఆహారం, నీరు అందివ్వాలని పిఠాపురం విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టరు ఉమర్ ఆలీషా పిలుపు ఇచ్చారు. సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ వద్ద ప్రధాన రహదారిని అనుకుని పీఠం కాకినాడ సభ్యుల ఆధ్వర్యంలో మనుషులతో పాటు పక్షులు, పశువుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సద్గురువు ఉమర్ ఆలీషా మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మూగ జీవాలకు తిండి గింజలు ఆహారంగాను, పాత్రలో నీరు పోసి అందివ్వాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరిగే కొద్ది శరీర ఉష్ణోగ్రత పెరుతుందని ప్రతి ఒక్కరూ మజ్జిగ తాగలన్నారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ అద్వైత ఆశ్రమం వేదాంత ఆచార్య స్వామి కృపానంద, భావరియల్ జైన్, రమేష్ జైన్, విశ్రాంత ఆర్టీఓ రామచంద్ర రావు, తురగా సూర్యారావు, ఎండీ జహరుద్దీన్ జిలానీ, హుసేన్ షా, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, కాశిన వెంకటేశ్వరరావు, పేరూరు సన్యాసిరావు, వీరభద్రరావు, నాగేశ్వరరావు, కాకినాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 9 నుంచి శాంతి ప్రార్థన పండుగలు

- కాకినాడకు పాల్ దినకర్ రాక
- కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ



విలేకర్లతో మాట్లాడుతున్న బిషప్ యెల్చూరి విద్యాసాగర్

కాకినాడ సిటీ: లూక్ మెమోరియల్ పీస్ టెంపుల్ ఆధ్వర్యంలో మే 9, 10, 11 తేదీల్లో కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో శాంతి ప్రార్థనా పండుగలు నిర్వహిస్తున్నట్లు బిషప్ యెల్చూరి విద్యాసాగర్ తెలిపారు. గురువారం కాకినాడ న్యూలైఫ్ క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్లో రెవరెండ్ యెల్చూరి పాపారావు అధ్యక్షతన పండుగల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ ప్రెసిడెంట్ బిషప్ ప్రతాప్ సిన్హా, మిషన్ టు ది నేషన్ డైరెక్టర్ బిషప్ ఏల్చూరి పాపారావు, సీటీసీ డైరెక్టర్ బిషప్ విలియమ్స్, సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రెవరెండ్ మూర్తిరాజు మాట్లాడుతూ మూడు రోజులు నిర్వహించనున్న ఉత్సవాలకు ముఖ్య అతిథిగా కారుణ్య డీమ్డ్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పాల్ దినకర్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు హాజరవుతారన్నారు. ఎంతో మంది ఆయన ప్రసంగాలతో దేవుని రక్షణ పొందారని అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి పాస్టర్లు, యూత్ సభ్యులు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు బిషప్ జోసెఫ్ బిన్నీ, రాజమండ్రి పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ టాటా విక్టర్, ఏపీసీసీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ స్టీఫెన్ ఆనంద్, బిషప్ విలియమ్స్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ జాన్ బెంజ్, జిల్లా పాస్టర్ ఫెలోషిప్ జనరల్ సెక్రటరీ రెవరెండ్ శీరం ఐజాక్, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు మోసా అబ్రహం, స్టేట్ ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జంగా గగారిన్, విజయకుమార్, మోజెస్ కిరణ్ పాల్గొన్నారు.

నిధుల వినియోగంలో జెడ్పీ ప్రథమ స్థానం



డిప్యూటీ సీఎం నుంచి పురస్కారం అందుకుంటున్న జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

కాకినాడ సిటీ: 15వ ఆర్థిక సంఘం నిధులు సద్వినియోగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానం నిలిచింది. దీంతో గురువారం రాష్ట్ర స్థాయి పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఉద్యోగులు అభినందించారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



కరపలో పంచాయతీరాజ్ దినోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

కరప: గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మౌలికవసతులు కల్పించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ ఎం.అనుపమ పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. పది మందికి ప్రయోజనం కలిగే పనులు చేస్తున్నామంటే పంచాయతీరాజ్ చట్టం వల్లనేనన్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రజోపయోగకరమైన అభివృద్ధి పనులు చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు నాపంచాయతీ-నాకు గర్వకారణం అనే థీమ్‌ను వివరించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది పంచాయతీరాజ్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, ఏఓ బీఎల్ నరసింహం, ఇన్‌చార్జి కార్యదర్శి పీఎస్ఆర్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామ సమస్యలపై చర్చించి, తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానాలు చేశారు.

భద్రంగా బాణసంచా తయారీ



వేళంగిలోని బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కరప: బాణసంచా తయారీ కేంద్రాలలో ప్రమాదాలు జరగకుండా తగిన భద్రత నియమాలు పాటించకపోయినా, నిబంధనలు అతిక్రమించినా బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, కాకినాడ సహాయ కార్మిక అధికారి వి.పద్మావతి హెచ్చరించారు. మండల పరిధిలో వేళంగి, గొర్రిపూడి, నడకుదురు తదితర గ్రామాల్లోని బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాలను గురువారం రెవెన్యూ, అగ్నిమాపక, కార్మికశాఖ అధికారులు తనిఖీచేసి, నిబంధనలు సక్రమంగా పాటిస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు. అగ్నిప్రమాద నియమాలు, కార్మిక నియంత్రణ నియమాలు కేంద్రాల నిర్వాహకులకు వివరించి, అవగాహన కల్పించారు. కాకినాడ జగన్నాథపురం ఏడీఎఫ్ఓ బి.ఏసుబాబు, కరప ఎస్ఐ టి.సునీత, ఆర్ఐ పవన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

పిఠాపురం: భవన నిర్మాణ కార్మికుల సహనాన్ని పరీక్షించొద్దని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లెయిముల పరిహారాలను కార్మికులకు తక్షణం చెల్లించాలని కోరుతూ ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజ్ కుమార్, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయడానికి ఇంకెన్ని సంవత్సరాలు సమయం కావాలని ప్రశ్నించారు. తక్షణం ఉచిత ఇళ్ల నిర్మాణాలు చేపట్టి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల ర్యాలీల సందర్భంగా రూ.2 కోట్ల ఆర్థిక సహకారాన్ని కార్మికులకు అందిస్తానని చేసిన వాగ్దానాన్ని అమలుచేయాలని వారు కోరారు.

ఉగ్రదాడి అమానుషం



కరపలో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



ఉగ్రదాడిలో మృతుల ఆత్మశాంతికి మౌనం పాటిస్తున్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శ్రీనగేష్ తదితరులు



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న మాల మహానాడు నాయకులు

కాకినాడ రూరల్: జమ్మూ కాశ్మీర్‌లో పర్యటనకు వెళ్లిన అమాయక ప్రజలపై ఉగ్రవాదుల దాడి చేయడం అమానుషమని ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉగ్రవాదుల దాడిలో మృతుల ఆత్మశాంతికి మౌనం పాటించారు. ఈ ఘటనపై కేంద్రానికి దేశ ప్రజలు సంఘటితంగా మద్దతు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ శాంతి ర్యాలీ

కరప: కాశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ మండల బీజేపీ అధ్యక్షురాలు ఎర్రంనీడి పద్మావతి ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. కాకినాడ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు పాల్గొని ఉగ్రవాదుల దాడిని ఖండించారు. ఈ చర్య అమానుషమని, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. కాకినాడరూరల్ అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలావతి, కిసాన్‌మోర్చ రాష్ట్రకార్యదర్శి బొలిశెట్టి వెంకటరామకృష్ణ, పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి

కాకినాడ సిటీ: ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దానిని అణచివేయడమే కాక పూర్తి నిర్మూలనకు ఆయా ప్రభుత్వాలు నడుంకట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా ఉగ్రదాడిని ఖండించాలని, ఉగ్రవాదులకు కులం, మతం, ప్రాంతం అంటూ ఏమీ ఉండదని, కేవలం వారికి తెలిసిందల్లా ఇతరులను మట్టుపెట్టడమేనని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ వరకు ఉగ్రవాదం నశించాలంటూ, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఆర్ఎస్ రత్నాకర్, డోకుబుర్ర భద్రం, చిన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేత వస్తేనే తీత!



పిఠాపురం ఉప్పాడ రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది



పిఠాపురం రైల్వే స్టేషన్ వద్ద వాహనాలు మాత్రమే తిరిగే రోడ్డును శుభ్రం చేస్తున్న సిబ్బంది

- ఊళ్లో వదిలేసి ఊరవతల ఊడ్పు
- అధికారుల హడావిడికి ముక్కున వేలేసుకుంటున్న పట్టణ ప్రజలు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినిమా యాక్టర్‌గానే చూస్తున్నట్టున్నారు స్థానిక మున్సిపల్ అధికారులు. ఆయన సినిమాల్లో నటించేటప్పుడు సెట్ వేసినట్లు పిఠాపురంలో మున్సిపల్ అధికారులు సెట్ చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆరు నెలలుగా మురుగుకూపంలా మారిన పిఠాపురం పట్టణంలో ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు డిప్యూటీ సీఎం పర్యటించనున్న నేపథ్యంలో ఆయన వెళ్లే రహదారులన్ని అద్దంలా తుడుస్తున్నారు. ఒక పక్క ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు తాజాగా ఇచ్చిన ఫిర్యాదులను వెనక్కు తీసుకోండని సచివాలయ అధికారుల ద్వారా ఫిర్యాదుదారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.



పిఠాపురం మంగయ్యమ్మరావుపేటలో డ్రైన్ దుస్థితి



పిఠాపురం మెయిన్ రోడ్డులో అగ్రహారం వద్ద పేరుకుపోయిన చెత్త